# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన చేశారు.
- నిమ్ హాన్స్ అందిస్తున్న సేవలు నలువైపులా వ్యాపించాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు..
- భారతదేశ ప్రాచీన వేదాంత తత్వాన్ని ప్రపంచం స్వీకరిస్తోందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తెలిపారు.
- దేశంలోని అంకుర సంస్థల ప్రయాణం గత 9 సంవత్సరాల్లో రూపాంతరం చెందిందని మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.
- ఒడిశా రాష్ట్ర 27వ గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.

====================

ఈ సంవత్సరంలో భారత్ ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో ఈ రోజు నౌరోజీ నగర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, సరోజినీ నగర్‌లో జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామోడేషన్ టైప్-II క్వార్టర్స్ రెండు పట్టణ పునరాభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారు. ద్వారకలో దాదాపు 300 కోట్ల రూపాయలతో నిర్మించిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను, ఢిల్లీ యూనివర్సిటీలో దాదాపు 600 కోట్ల రూపాయల విలువైన మూడు కొత్త ప్రాజెక్టులకు నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2025 ప్రపంచ దేశాల్లో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేసే సంవత్సరంగా నిలుస్తుందని, దేశం రాజకీయ, ఆర్థిక స్థిరత్వానికి ప్రతీకగా మారిందని అన్నారు. ఈ ఏడాది భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పాదక కేంద్రాల్లో ఒకటిగా మార్చే సంవత్సరం అవుతుందని పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

====================

“నిమ్ హాన్స్” అందిస్తున్న సేవలు దేశ నలు మూలాలకు వ్యాపించాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ రోజు బెంగళూరు నిమ్ హాన్స్ 100 సంవత్సరాల వేడుకలలో పాల్గొన్న రాష్ట్రపతి మాట్లాడుతూ... ప్రపంచం లో నిమహాన్స్ మానసిక వైద్యంలో అగ్ర స్థానంలో వుందని, మానసిక రోగులకు ఇది చక్కటి వైద్యాన్ని అందిస్తుందన్నారు. అలాగే ప్రాచీన యోగా, ఆయుర్వేద వైద్యాలను వైద్య విధానంలో చేర్చడం పట్ల అభినందించారు. కరోనా సమయంలో వృద్ధులు, మహిళలు ఒత్తిడికి గురైన వాళ్ళ భయాందోళనాలను తొలగించడంలో “నిమ్ హాన్స్” ముఖ్య భూమిక పోషించిందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

(వాయిస్ 40 సెకన్లు)

====================

సంఘ సంస్కర్త సావిత్రీబాయి ఫూలే జయంతి సందర్భంగా ఆమెకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. సావిత్రీబాయి ఫూలే మహిళా సాధికారతకు మార్గదర్శి అని, విద్య, సామాజిక సంస్కరణల విషయాలలో కృషి చేశారని సామాజిక మాధ్యమం వేదికగా కొనియాడారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే సావిత్రీబాయి ఫూలే మహిళా విద్యకు ప్రాధాన్యతనిచ్చి దానికోసం పోరాడారని వ్యాఖ్యానించారు.

====================

భారత్ 110కి పైగా యూనికార్న్ స్టార్టప్‌లతో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ గా అవతరించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో భారతీయ అంకుర సంస్థలపై పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత 9 సంవత్సరాల్లో దేశంలోని అంకుర సంస్థల ప్రయాణం రూపాంతరం చెందిందని, వినూత్న ఆలోచనలు ఉన్న అసంఖ్యాక వ్యక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. దేశంలోని 43 శాతం అంకురసంస్థల్లో మహిళా వ్యవస్థాపకులు ఉన్నారన్నారు. దేశం నుంచి ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయని, భవిష్యత్తులో 800 బిలియన్ డాలర్లను అందిగమించవచ్చని కేంద్రమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

విరామం

====================

మహా కుంభమేళా (Maha Kumbh)కు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా. ఈనేపథ్యంలో అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు కనిష్టానికి చేరి మంచు దట్టంగా కురుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే భక్తులు అక్కడి వాతావరణం గురించి తెలుసుకునేందుకు వాతావరణ శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యేక పేజీని పొందుపర్చామని ఐఎండీ (IMD) డైరెక్టర్ మనీశ్ రణాల్కర్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి వాతావరణంలో వచ్చే మార్పులను తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా రోజుకు రెండుసార్లు వాతావరణ సూచనలను అందులో జారీ చేస్తామని వెల్లడించారు. దీని కోసం కుంభమేళా నిర్వహించే ప్రాంతాన్ని తాత్కాలిక జిల్లాగా ప్రకటించామన్నారు.

====================

భారతదేశ ప్రాచీన వేదాంత తత్వాన్ని ప్రపంచం స్వీకరిస్తుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో 27వ అంతర్జాతీయ వేదాంత మహాసభల ప్రారంభోత్సవానికి ఉపరాష్ట్రపతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేదాల సారాంశం దేశానికి శాశ్వతమైన సంపదని పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

====================

ఆస్తుల ఇ-వేలం కోసం ప్రభుత్వం ఈరోజు పునరుద్ధరించిన పోర్టల్ బ్యాంక్ నెట్ (BAANKNET)ని ప్రారంభించింది. ఈ ప్లాట్ ఫారమ్ అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి ఇ-వేలం ఆస్తులపై సమాచారాన్ని ఏకీకృతం చేసి, కొనుగోలుదారులు, పెట్టుబడిదారులకు విస్తృత శ్రేణి ఆస్తులను కనుగొనడానికి సమగ్ర సమాచారన్ని అందిస్తుంది. ఈ పోర్టల్‌ను ప్రారంభించిన ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం. నాగరాజు మాట్లాడుతూ... ఇది ప్రభుత్వ బ్యాంకుల పునరుద్ధరణ ప్రక్రియకు, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్‌లను మెరుగుపరచడానికి దోహపడుతుందని పేర్కొన్నారు.

====================

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో ఐలాండ్స్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐడీఏ) 7వ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ దేవేంద్ర కుమార్ జోషి, లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ పటేల్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2017లో ఏర్పాటైన IDA దేశంలోని దీవుల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తుంది.

====================

ఒడిశా రాష్ట్ర 27వ గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

====================

ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ ఉర్స్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు.  అజ్మీర్ షరీఫ్ దర్గా వద్ద తన తరపున అందించబడే చాదర్‌ను కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు నరేంద్ర మోదీ అందించారు. రేపు అజ్మీర్ షరీఫ్‌లో మోదీ తరపున చాదర్ అందజేస్తానని కేంద్రమంత్రి పాత్రికేయులకు తెలియజేశారు.

====================

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య సిడ్నీ వేదికగా ఆఖరి టెస్టు మ్యాచ్ ఈ రోజు ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 185 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 9 పరుగులు చేసింది.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 072 పాయింట్లతో లాభాల్లో ప్రారంభమై చివరికి 720 పాయింట్ల నష్టంతో 79 వేల 223 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 207 పాయింట్ల నష్టంతో 23 వేల 981వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు క్షీణించి 85.78 వద్ద స్థిరపడింది.

====================
====================